క్లుప్తంగా

అచ్చమ్మ తల్లి ఉత్సవాల్లో జబర్దస్త్ టీమ్ సందడి



గాలాయగూడెం అచ్చమ్మతల్లి ఉత్సవాల్లో జబర్దస్త్ టీమ్ సభ్యులు

దెందులూరు: గాలాయగూడెం శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాల్లో జబర్దస్త్ టీమ్ సందడి చేసింది. ప్రతి ఏటా అచ్చమ్మ తల్లి ఆశీస్సులు తీసుకోవడం, ఉత్సవాల్లో ప్రదర్శనలు ఇవ్వడం తమకు పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని జబర్దస్త్ టీమ్ నటులు రాకెట్ రాఘవ, టీమ్ సభ్యులు అన్నారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు జబర్దస్త్ టీమ్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉత్సవాలకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులను ప్రదర్శనలు, స్కిట్ల ద్వారా అలరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు జబర్దస్త్ టీమ్‌ను సన్మానించారు.

సమస్యాత్మక గ్రామాలు, వ్యక్తులపై ప్రత్యేక దృష్టి



పెదవేగి సీఐ కె.శ్రీనివాస్

దెందులూరు: పెదవేగి పోలీస్ సర్కిల్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలు, వ్యక్తులపై పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక దృష్టి సారించామని పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాస్ అన్నారు. గురువారం దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ భారతీయ ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి క్రమశిక్షణ, ప్రభుత్వ నిబంధనలు అనుసరిస్తూ విధులు నిర్వహించాలన్నారు. అన్ని గ్రామాల్లో అన్ని రాజకీయ పార్టీలు ప్రజలు, ఎన్నికలు విధులు నిర్వహించే ఉద్యోగులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఇప్పటి వరకు నేర చరిత్ర ఉన్న వ్యక్తులు, రౌడీషీటర్లు కోర్టుల్లో బైండోవరైపన వ్యక్తులు, వారి ప్రవర్తన, కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించినా సహించేది లేదని హెచ్చరించారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



ఉంగుటూరులో గృహనిర్మాణాలపై సమీక్షిస్తున్న జిల్లా హౌసింగ్ అధికారి రవికుమార్

గణపవరం(ఉంగుటూరు): ఉంగుటూరు నియోజకవర్గంలో మంజూరైన ప్రభుత్వ గృహాల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని, దీనికోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా హౌసింగ్ అధికారి కేవీఎస్ రవికుమార్ అన్నారు. గురువారం ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయంలో నిడమర్రు, ఉంగుటూరు మండలాలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణంపై డీఆర్‌డీఏ, డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష జరిపారు. ఆయా మండలాలలో పూర్తయిన, ప్రగతిలో ఉన్న ఇళ్ల వివరాలను సిబ్బంది వివరించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, వసతుల కల్పనపై ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణాలన్నీ త్వరగా పూర్తి చేయడానికి సంబంధిత సిబ్బంది స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేసుకునే అవగాహన కల్పించాలని కోరారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం


గణపవరం(ఉంగుటూరు): ఉంగుటూరు మండలం కైకరం గ్రామంలోని శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దేవతామూర్తులను పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని కల్యాణాన్ని తిలకించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమడోలు: అనారోగ్యం, ఆర్థిక సమస్యలు తాళలేక ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. భీమడోలుకు చెందిన లారీ డ్రైవర్, వృద్ధుడు కోపల్లి కేహెచ్ వెంకటరాజు (63) అనారోగ్యం కారణంగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. దీంతో పాటు ఆర్థిక సమస్యలు తలెత్తడంతో మనస్తాపం చెంది ఈ నెల 17న తన ఇంటిలో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఏలూరులోని ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. వైద్యం పొందుతూ వెంకటరాజు మృతి చెందాడని, మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయాలకు సొంత గూడు

- పంచాయతీలకు స్మార్ట్ లుక్
- గతంలో కూలే స్థితిలో భవనాలు–నేడు ఆధునిక వసతులతో నిర్మాణం
- 75 సచివాలయాలకు రూ.34.5 కోట్లు నిధుల మంజూరు
- 58 భవన నిర్మాణాలు పూర్తి
- తుది దశలో 17 భవన నిర్మాణాలు



నిడమర్రు : గ్రామ స్వరాజ్య స్థాపనలో సచివాలయాలే కీలకంగా మారాయి. ప్రజలకు చేరువగా పాలన ఉండాలని, వారి సమస్యలు నేరుగా పరిష్కరించే ఓ చక్కని వేదిక కావాలని, అర్జీలు అందజేసేందుకు సుదూరంలో ఉన్న మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు తలెత్తకూడదని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. అందుకు అనుగుణంగా గ్రామ, వార్డు సచివాలయాలను రూపొందించారు. ఆయా సచివాలయాలకు గడిచిన మూడేళ్లలో సొంత భవనాలు నిర్మించేలా పక్కా ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దీంతో నాడు కూలేందుకు సిద్ధంగా ఉన్న గ్రామ పంచాయతీ భవనాలు..నేడు సచివాలయాలుగా ఆధునిక హంగులతో గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. 2019లో మహాత్మాగాంధీ జయంతి పురస్కరించుకుని అక్టోబర్ 2న సచివాలయ వ్యవస్థకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ముందుగా ఆయా శాఖలకు సంబంధించిన ఉద్యోగులను పోటీ పరీక్ష ద్వారా ఎంపిక చేసి అదే రోజు (2019 అక్టోబర్ 2) సచివాలయాలకు అవసరమైన సిబ్బందికి జాయినింగ్ ఆర్డర్లు అందజేసింది. అప్పట్లో ఉన్న పాత పంచాయతీ భవనాల్లో, అద్దె భవనాల్లో వారంతా విధులు నిర్వహించేవారు. అనంతరం ఉద్యోగులకు, సచివాలయాలకు వచ్చే ప్రజలకు అన్ని వసతులతో కూడిన భవనాలు నిర్మించే లక్ష్యంతో ఒక్కో గ్రామ సచివాలయానికి రూ.40 లక్షలు నిధులను దశల వారీగా ప్రభుత్వం మంజూరు చేసింది. దీనిలో భాగంగా ఉంగుటూరు



నిడమర్రు గ్రామ పంచాయతీ నాడు (ఫైల్)



నిడమర్రు గ్రామ సచివాలయ భవనం నేడు



బువ్వనపల్లి పంచాయతీ భవనం (ఫైల్)



ప్రస్తుతం బువ్వనపల్లి గ్రామ సచివాలయ భవనం

నియోజకవర్గంలోని 84 గ్రామ పంచాయతీలను జనాభా ప్రాతిపదికన పరిపాలనా పరంగా 75 గ్రామ సచివాలయాలుగా ఏర్పాటు చేశారు. ఈ 75 గ్రామ సచివాలయాలకు సంబంధించిన భవన సముదాయం నిర్దిష్ట ప్రణాళికతో ఈ భవనాలు ఒకే మోడల్‌గా నిర్మాణం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 75 సచివాలయ భవనాలకు రూ.32.25 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. మరిన్ని సౌకర్యాల కల్పనకు జిల్లా పరిషత్ నుంచి రూ.2.25 కోట్లు నిధులను సమకూర్చారు. మొత్తం 75 సచివాలయాలకు రూ.34.5 కోట్లు నిధులను ప్రభుత్వం వెచ్చించింది. దీంతో ఆయా గ్రామాల్లో అన్ని సౌకర్యాలతో ప్రజల స్వంత ఆస్తిగా గ్రామ సచివాలయ భవనాలు వెలుస్తున్నాయి.

ఆధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులో ప్రభుత్వ సేవలు పారదర్శకంగా త్వరిత గతిన ప్రజలకు అందించేందుకు అవసరమైన సాంకేతిక వ్యవస్థను అన్ని సచివాలయాల్లో అందుబాటులోకి ప్రభుత్వం తీసుకువచ్చింది. ఇంటర్ నెట్ సౌకర్యం కల్పించడంతో పాటు కంప్యూటర్లు, డిజిటల్ కలర్ పింటర్లు, జిరాక్స్ మెషీన్లు, ఒక్కో సచివాలయానికి సిబ్బందికి 10 టేబుల్స్, 10 ఎస్ మోడల్ చైర్స్, సచివాలయానికి వచ్చే ప్రజల కోసం 20 ఫైబర్ చైర్స్, 6 క్లోజ్‌డ్ ర్యాక్స్ పెద్ద బీరువా, 10 బయోమెట్రిక్ డివైజ్‌లు, సిబ్బందికి రెండు జతల యూనిఫాం, స్టేషనరీ, పర్యవేక్షణకు సీసీ కెమెరాలు వంటి సౌకర్యాలను ప్రభుత్వం సమకూర్చింది.



శిథిలావస్థలో జల్లికొమ్మర పంచాయతీ కార్యాలయం (నాడు)



జల్లికొమ్మర గ్రామసచివాలయ సముదాయం

సచివాలయ భవన నిర్మాణాలు ఇలా

మండలం	మంజూరు	నిర్మాణం పూర్తయినవి	తుది దశలో ఉన్నవి
గణపవరం	20	20	0
నిడమర్రు	14	12	02
ఉంగుటూరు	24	14	10
భీమడోలు	17	12	05
మొత్తం	75	58	17

రికార్డు స్థాయిలో భవనాల నిర్మాణం



నా రాజకీయ జీవితంలో 3 సార్లు సర్పంచ్‌గా, 3 సార్లు ఉపసర్పంచ్‌గా సేవలను అందించాన. ఇలా రికార్డు స్థాయిలో సొంత భవనాల రూపంలో పంచాయతీలకు ఆస్తులను సమకూర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది. గతంలో 80 శాతంపైగా పంచాయతీ భవనాలు ఎప్పుడు కూలుతాయో? తెలియని పరిస్థితి. నేడు ప్రతి గ్రామంలో కళకళలాడుతున్న సొంత గ్రామ సచివాలయ భవనం నిర్మించడంపై సర్పంచ్‌గా సీఎం జగన్ పాలనను మరోసారి స్వాగతిస్తాను.

– పుప్పాల మెహర్‌కుమార్, జిల్లా సర్పంచ్‌ల చాంబర్ ఉపాధ్యక్షుడు,

గతంలో అరకొర సిబ్బందితో ఇబ్బందులు



గతంలో పంచాయతీల్లో ఇద్దరు లేదా ముగ్గురు ఉద్యోగులతో మాత్రమే విధులు నిర్వహిం చేవాళ్లం. నేడు ఆ సంఖ్య 11కు చేరింది. కొత్తగా నిర్మించిన మా సచివాలయ భవనం విశాలంగా, సౌకర్యవంతంగా ఉంది. పరిపాలనకు అవసరమైన అన్ని సాంకేతిక పరికరాలు ప్రభుత్వం సమకూర్చింది, దీంతో ప్రజలకు మా నుంచి పారదర్శకంగా సేవలు పొందేందుకు వీలైంది.

– పి.సరళ, పంచాయతీ కార్యదర్శి, జల్లికొమ్మర

వేగంగా భవన నిర్మాణాలు



నియోజకవర్గంలో 75 గ్రామ సచివాలయాలకు 17 మాత్రమే ఇంకా ప్రారంభం కాలేదు. కొన్ని ఆలస్యంగా నిర్మాణాలు ప్రారంభించడం, ఇతర కారణాల వల్ల వాటి నిర్మాణాలు తుది దశలో ఉన్నాయి. నిధులు మంజూరై ఉన్నందున మరో నెల రోజుల్లో 95 శాతం సచివాలయ భవనాలు నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఉప్పలపాటి శ్రీనివాసరావు, డీఈ, పంచాయతీరాజ్, భీమడోలు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లలా భావించి పాలన చేస్తున్నారని ఉమ్మడి జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ పెదపాడు మండలంలో 98 వేల 378 మందికి రూ.312 కోట్ల డీబీటీ ద్వారా 36 వేల 613 మందికి మరో రూ.205 కోట్లు నాన్‌డీబీటీ ద్వారా లబ్ధి వెరసి రూ.516కోట్ల లబ్ధి ప్రజలకు చేకూర్చినట్లు పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.19 కోట్ల 8 క్షల వ్యయంతో ఇళ్ల స్థలాలకు 51ఎకరాలు భూమిని కొనుగోలు చేసి 2082 మందికి ఇళ్ల స్థలాలు అందించామన్నారు. గతంలో నాయకులు మాయ మాటలు చెప్పి అధికారంలోనికి వచ్చిన తరువాత వారి అభివృద్ధిని మాత్రమే చూసుకున్నారన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీలో 373 ఇళ్లు నిర్మాణం పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేశారని చెప్పారు. మిగతా వారి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. 800 మంది తమ సొంతస్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేసుకున్నారన్నారు. మండలంలోని 21 గ్రామ సచివాలయాల్లో 9 గ్రామ సచివాలయాల ప్రారంభించామని, వివిధ దశల్లో ఉన్న మిగతా భవనాలు మరికొన్ని రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పారు. వ్యవసాయ శాఖ ద్వారా 37548 మందికి రూ.47 కోట్ల రూపాయాలు అందించామన్నారు.

రైతు స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.2 కోట్ల 14లక్షలు రుణాలు ఇచ్చి, వాటిలో రూ.75 లక్షల సబ్సిడీ అందించామని చెప్పారు. 16,997 మందికి రూ.2కోట్ల 18 లక్షలు సున్నావడ్డీ రూపంలో అందించామన్నారు. వైఎస్సార్ ఆసరా పేరుతో నాలుగు విడతలుగా 14,790 మందికి రూ.41.6కోట్లు రుణమాఫీ చేశామని చెప్పారు. జగనన్న తోడు పథకం ద్వారా 1226 మందికి రూ.12 కోట్ల 26 లక్షల అందించామని చెప్పారు.

వేగంగా రోడ్ల అభివృద్ధి

మండలంలో రూ.2 కోట్లతో పెదపాడు–కుదరవల్లి రూ.3 కోట్లతో కొత్తూరు– పాతముప్పర్రు–వీరమ్మకుంట –పెదపాడు రహదారి, రూ.4 కోట్లుతో పెదపాడు– వడ్డిగూడెం రహదారి, రూ.3 కోట్లతో వట్లూరు–కొప్పాక రోడ్డు, రూ.80 లక్షల వ్యయంతో వట్లూరు బైపాస్ నిర్మించామని వంగాయగూడెం– పెదపాడు– పెరికీడు రహదారికి రూ.55 కోట్లు నిధులు మంజూరు కాగా రూ.10 కోట్ల మేర పని జరిగిందని ఇంకా జరగాల్సి ఉందన్నారు. గోగుంట రహదారి రూ.2 కోట్లు నిధులు మంజూరయ్యాయని త్వరలో ఆ రహదారి కూడా నిర్మిస్తామన్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారులు, భవనాలు, డ్రెయినేజీలు, పైప్‌లైన్లు వగైరా రూ.150 కోట్లు పనులు చేపట్టామన్నారు. ఎంపీపీ బత్తుల రత్నకుమారి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలోని సమస్యలు వాటి పరిష్కారాలుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పనప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరిలు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు అప్పన పద్మావతి, రెడ్డి స్వర్ణకుమారి, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, ఎంపీడీఓ జె.తేజరతన్, ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి బత్తుల ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే వాసుబాబు పర్యటన ఇలా

నిడమర్రు: చానమిల్లి గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్య కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సీసీ డ్రెయిన్స్‌ను, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను, రైతు భరోసా కేంద్రాన్ని, సీసీ రహదారులను మంచినీటి ట్యాంక్, పైప్‌లైన్ నిర్మాణాలను ఎమ్మెల్యే వాసుబాబు ప్రారంభిస్తారని సత్య కుమార్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని ఆయన కోరారు.

పీఎంపీలకు ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం



పీఎంపీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

గణపవరం: మారుమూల గ్రామీణ పేద ప్రజలకు ప్రాథమిక వైద్యసేవలు అందిస్తున్న పిఎంపిలకు ప్రభుత్వ ప్రోత్సాహం అవసరమని పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిడమర్తి జయసూర్య అన్నారు. గురువారం గణపవరం లయన్స్ క్లబ్ భవనంలో గణపవరం, నిడమర్రు మండలాల పీఎంపీ అసోసియేషన్ల సర్వసభ్యస మావేశం ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఎంపీలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వ పరంగా వారిని ప్రోత్సహించాలని కోరారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ గుణసూర్య మాట్లాడుతూ పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. తాడేపల్లిగూడెంలో తాము నిర్వహిస్తున్న యూనియన్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ వైద్య సేవల ప్రారంభించడానికి ప్రభుత్వం అనుమతించిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, పీఎంపీ సభ్యులు నిమ్మల సుబ్బారావు, అలీ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓలకు సీనియర్ అసిస్టెంట్ పదోన్నతి కల్పించాలి



ఆర్‌డీఓ ఖాజావలికి వినతి పత్రాన్ని అందిస్తున్న ఆర్‌ఎస్‌ఆర్ చంద్రమూర్తి

పెదపాడు: వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్ పదోన్నతి కల్పించాలని జిల్లా గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్‌ఎస్‌ఆర్ చంద్రమూర్తి కోరారు. ఈ మేరకు ఏలూరులో రెవిన్యూ డివిజనల్ అధికారి ఎస్‌కే ఖాజావలికి వినతి పత్రాన్ని అందించారు. గ్రామ రెవెన్యూ అధికారులకు తక్కువ శాతం మాత్రమే సీనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించారని తెలిపారు. 2008 నుంచి గ్రామ రెవెన్యూ అధికారులుగా జాయినై ఏపీపీఎస్సీ ద్వారా డిపార్ట్‌మెంట్ పరీక్షలు ఉత్తీర్ణులు కావడంతోపాటు అకౌంట్స్ పరీక్ష సర్వేయర్ ట్రైనింగ్ పూర్తి చేసినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సాయిల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార యువతకు చేయూత



మత్స్యకార యువకునికి సబ్సిడీ వాహనం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: మత్స్యకార యువత ఉపాధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ప్రధానమంత్రి మత్స్యకార యోజన పథకంలో 60 శాతం సబ్సిడీపై రూ.22 లక్షల విలువైన వాహనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ఈ వాహనం ద్వారా లైవ్ ఫిష్‌ను ఫిష్ ఆంధ్రా సెంటర్‌లకు రవాణా చేస్తూ ఆదాయాన్ని ఆర్జించవచ్చునన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకుని తమ ఆర్థిక స్థితి మెరుగుపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నిడమర్రు మండల బాధ్యుడు పుప్పాల కన్నబాబు, గణపవరం, నిడమర్రు మండలాల వైఎస్సార్ సీపీ కన్వీనర్‌లు దండు రాము, సంకు సత్య కుమార్, నిడమర్రు సర్పంచ్ పాట్నూరి ఉమ, మండల రైతు సలహా సంఘం కన్వీనర్ పోలిశెట్టి రమేష్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో ఈఆర్‌ఓ సమీక్ష



తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షిస్తున్న దృశ్యం

దెందులూరు: రానున్న ఎన్నికల్లో భారత ఎన్నికల సంఘం ఆదేశాలకనుగుణంగా నిబంధనలన్నీ రాజకీయ పార్టీలు పాటించాలని దెందులూరు నియోజకవర్గ ఈఆర్‌ఓ బాబ్జి అన్నారు. గురువారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో రానున్న ఎన్నికలకు సంబంధించి ప్రవర్తన నియమావళి, ఓటర్ల లిస్టు, ఎన్నికల్లో రాజకీయ పార్టీ పాత్ర ఇతర వివరాలపై క్షుణ్ణంగా సమీక్షించారు. సమావేశంలో తహసీల్దార్ వి.జితేంద్ర, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి బొడ్డు సతీష్ పాల్గొన్నారు.

పోతునూరు పీహెచ్‌సీకి అంబులెన్స్ వితరణ

దెందులూరు: మండలంలోని పోతునూరు పీహెచ్‌సీకి ఆ గ్రామానికి చెందిన దాత పర్వతనేని వివేక్ ఆనంద్ అంబులెన్స్‌ను ట్రస్టు తరఫున ప్రకటించారు. పోతునూరు పర్వతనేని ఉపేంద్ర ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు దివంగత కేంద్ర మంత్రి పర్వతనేని ఉపేంద్ర కుమారుడు, పర్వతనేని ఫౌండేషన్ ఉభయ రాష్ట్రాల కార్యదర్శి వివేక్ ఆనంద్ పోతునూరుతో పాటు సమీప గ్రామాల ప్రజల కోసం అంబులెన్స్‌ను త్వరలో వైద్యశాలలో జరిగే కార్యక్రమంలో అందజేస్తారని, ఆస్పత్రిచైర్మన్, దెందులూరు ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, సర్పంచ్ బోదుల స్వరూప్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షులు, పోతునూరు కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు గూడపాటి పవన్‌కుమార్ తెలిపారు.

పోలింగ్ బూత్‌ల తనిఖీ

దెందులూరు: మండలంలో గురువారం దెందులూరు తహసీల్దార్ వి.జితేంద్ర పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్‌ఆదేశాల మేరకు దెందులూరు, కొవ్వలి, రామారావుగూడెం, గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వి.జితేంద్ర మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో వివిధ గ్రామాల్లో 27 పోలింగ్ కేంద్రాల్లో శ్లాబ్, తాగునీరు, విద్యుత్, ప్రహరీగోడలు, బెంచీలు, గేట్లు వంటి సౌకర్యాలను తనిఖీ చేశారని అన్నారు. ఆయన వెంట ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమ, వీఆర్‌ఓలు కిషోర్, రామకృష్ణ, కృష్ణవేణి, శ్రీను, అనిరుద్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

భీమడోలు: భీమడోలు కనకదుర్గమ్మ వారి ఆలయం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహితకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే హైదరాబాద్‌కు చెందిన గడ్డం సాయితేజ అతని భార్య శ్రావణిలు పెంటపాడు మండలం అలంపురంలోని తమ బంధువుల ఇంటికి వచ్చారు. అక్కడి నుంచి మోటార్ సైకిల్‌పై ద్వారకాతిరుమల ఆలయానికి వెళ్తుండగా మార్గ మధ్యలో భీమడోలు కనక దుర్గమ్మ వారి ఆలయం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న ట్రక్కు ఆటో డ్రైవర్ అతివేగంగా నిర్లక్ష్యంతో ముందు వెళ్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెనుక సీటులో కూర్చున్న భార్య శ్రావణికి బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె భర్త సాయితేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన ట్రక్కు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.